అన్ని వర్గాలకు ఉచిత వైద్య సేవలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తామని జిల్లా వైద్యాధికారి గీతాబాయ్ అన్నారు. మండల పరిధిలోని వణుకూరు గ్రామంలో గురువారం ఆమె జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గీతాబాయ్ మట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నిర్వహించే వైద్య శిబిరాలకు మంచి స్పందన కనబడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆస్పత్రులకు తరలిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ జగన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్క విజయ, మండల ప్రత్యేకాధికారి ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 340 మందికి వైద్య సేవలు అందించారు.

పోరంకి సచివాలయం 2లో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. జిల్లా వైద్యధికారి గీతాబాయ్ వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, వైఎస్సార్ సీపీ నేతలు మంచినేని పరమేష్, ఆకునూరు సుబ్బారావు, ముప్పాళ్ల వెంకటేశ్వరరావు, నల్లమోతు జీవన్, పచ్చిగళ్ల నాగరాజు, బందెల రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 251 మందికి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటుతో ప్రభుత్వం కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తుందని ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద ఓగిరాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ త్రిపురం లక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో 575 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి జె.జ్యోతి సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, వైద్యులు డాక్టర్ రాకేష్ అనిల్, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీప, డాక్టర్ శివరామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వణుకూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య సేవలు.

పెనమలూరు: వణుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఉచిత వైద్య సేవలు అందించారు. గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో పని చేస్తున్న కార్మికులకు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేశారు. వారికి ఆరోగ్యం పట్ల పలు సూచనలు వైద్యులు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పారిశుద్ధ్య కార్మికులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా లభిస్తుందని ఎంపీపీ వడ్లమూడి సరోజని అన్నారు. తేలప్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. వైద్యం కోసం పేదవాళ్లు అప్పులు పాలయ్యే పరిస్థితి రాకూడదని ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ఎంతగానో ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ వలంటీర్లు ప్రత ఇంటికి వెళ్లి సర్వే చేసి అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి స్పెషలిస్టుల ద్వారా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారని వివరించారు. ఈ శిబిరంలో సచివాలయం–2కి చెందిన 453మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, తహసీల్దార్ డి.వనజాక్షి, ఈవోపీఆర్డీ బాషా, కార్యదర్శి కృపాకుమార్, డాక్టర్లు కె.వాణి, వి.లావణ్య, వి.సుబ్బారావు, బి.వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వింత శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రామిరెడ్డి పాల్గొన్నారు.

454 మందికి వైద్య సేవలు

గన్నవరం: మండల కేంద్రంలోని అంబేద్కర్ పార్కు కమ్యూనిటీ హాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని శిబిరం ప్రారంభించారు. అనంతరం క్యాంప్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో వైద్య సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు. పేదల ఆరోగ్యంపై సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు నేతృత్వంలోని ఐదుగురు వైద్యుల బృందం 454 మందికి వైద్య సేవలందించారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు, ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, డిప్యూటీ తహసీల్దారు అరుణ్, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో సురక్ష క్యాంప్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

అందరి ఆరోగ్యం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

కంకిపాడు: అందరి ఆరోగ్య సంరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ సుందర్‌కుమార్, డాక్టర్ సంతోష చంద్రిక, డాక్టర్ నిఖిత, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ కౌసల్య, కంటి వెలుగు ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ వైద్య సేవలు అందించారు. 552 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి షాహిద్ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఎంపీడీఓ అనూష, ఎంఈఓ ప్రసాద్, ఈఓ బి.వెంకటేశ్వరరావు, వీఆర్ఓ మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నేతలు ముసిబోయిన వెంకటేశ్వరరావు, పిడికిటి రామకోటేశ్వరరావు, ముసిబోయిన మోహనకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం వైద్య సిబ్బంది ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి షుగరు, బీపీ వంటి 7 రకాల పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. తెంపల్లిలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఉపయోగాలను వివరించారు.



తెంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, వైద్యులు

కానుమోలులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, గైనకాలజీ, అప్తాలజీ, దంత సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు అనుసరించాల్సిన ఆహార పద్ధతులు, సమతుల్య పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో 554 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ పాల్గొన్నారు.



పెద ఓగిరాలలో జగనన్న ఆరోగ్య సురక్షలో ఆర్డీవో విజయ్‌కుమార్, సర్పంచ్ లక్ష్మి



పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ సరోజిని, అధికారులు



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు



పునాదిపాడులో సురక్ష సేవలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో అనూష

క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ అనూష తెలిపారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలో వివిధ శాఖల నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు మంతెనలో జగనన్న ఆరోగ్య సురక్ష

కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనూష తెలిపారు. ఉదయం 8 గంటలకు మంతెన సెక్రటేరియట్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందన్నారు. నిపుణులైన వైద్యులు శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామలింగేశ్వరస్వామి సేవలో అడిషనల్ కమిషనర్



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సీఆర్ఎఫ్ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్‌ను సత్కరించి స్వామివారి చిత్రపటం బహూకరించి ప్రసాదం అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఈవో బి.గంగాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణపై అవగాహన



పెనమలూరు: సామూహిక ఎలుకల నివారణకు వీఏఏవోలు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. పోరంకి రైతుభరోసా కేంద్రంలో గురువారం వీఏఏలకు ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలన్నారు. పంట పొలాలు, కాలువ గట్లు, పట బోదెలు, ప్రభుత్వ స్థలాల్లో ఎలుకల నివారణకు రైతులు, స్థానికులతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎకరాకు 194 గ్రాముల నూకలు, 4 గ్రాముల వేరుశెనగ నూనె, 2 గ్రాముల ఎలుకల మందు బ్రోమొడయోలిన్ మందు తయారు చేసి ఎలుకల నివారణకు ఉపయోగించాలని తెలిపారు.

మైక్రోస్కోప్‌లతో ఆధునిక చికిత్స

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన మైక్రోస్కోప్‌లను డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరికరాల సహాయంతో దంత అంతర్గత బాగాలను పరీక్షించటం, వైద్యం చేయటం సులభం అవుతుందని చెప్పారు. కన్వీనర్ నాగసాయి మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు, హెచ్‌వోడీ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో వరి పొలాలు పరిశీలన



ఉంగుటూరు: వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా మోతాదు ప్రకారం కలుపు నివారణ చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఐఆర్ఆర్ (ఇండియన్ రైస్ రీసర్చ్) శాస్త్రవేత్త శ్రీదేవి అన్నారు. మండలంలోని ఆత్కూరు, పొణుకుమాడు వరి పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగులో కలుపు అధికంగా ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. రైతులు కలుపు నివారణకు ఏ రసాయన మందులు వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కలుపు నివారణకు అధిక మోతాదులో రసాయన మందులు వినియోగిస్తే నేల సారం కోల్పోవడంతో పాటు వ్యయం పెరుగుతుందని పేర్కొన్నారు. సరైన సమయంలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. ఏవో హరీష్‌కుమార్, ఏఈవో దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి

కంకిపాడు: అందరి సమన్వయంతో గ్రామాభివృద్ధి సాధ్యమని కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, పైపులైను విస్తరణ పనులు, స్థానిక సమస్యలపై సమీక్షించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీలో విజయం సాధించిన వైఎస్సార్ సీపీ మద్దతుదారు మలబంటి దుర్గాప్రసాద్ వార్డు సభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు సత్కరించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు

కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తంబాబత్తుల ఓంకారం, బాకీ రాజు, వార్డు సభ్యులు వంకదారు చిట్టబ్బాయ్, అహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కంకిపాడులో ఉచిత వైద్య శిబిరం

కంకిపాడు: మండల కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహక ప్రతినిధి సీహెచ్ వీరకుమారి తెలిపారు. పట్టణంలోని లాకురోడ్డులో సాయిబాబా గుడి పక్కన రాజుల బజారులో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో గుంటూరు లలిత హాస్పిటల్ వైద్యులు, కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్‌రావు వైద్య సేవలు అందిస్తారన్నారు. గుండె సంబంధ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: చోడవరం గ్రామంలో భార్యాభర్తలను చంపుతానని బెదిరించిన వ్యక్తి పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... చోడవరం గంగానమ్మ గుడి వద్ద సింహాద్రి నాగజ్యోతి, భర్త వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. వెంకటేశ్వరరావు ముఠా పనులు చేస్తాడు. ఆయనకు తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంకు చెందిన మారెం దేవేంద్రకుమార్ పరిచయముంది. దేవేంద్రకుమార్ మద్యం తాగి చోడవరం వెంకేశ్వరరావు ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే చాలా రోజుల తరువాత మరలా మంగళవారం రాత్రి మద్యం తాగి చోడవరం వచ్చి సింహాద్రి నాగజ్యోతి పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆమె భర్త వెంకటేశ్వరరావు పై దాడి చేసి ఇద్దరిని చంపుతానని బెదిరించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నా మట్టి – నా దేశం కలశ ప్రదర్శన

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తీసుకొచ్చిన మట్టిని కలశంలో కలిపారు. అనంతరం మట్టి కలశంతో హైస్కూల్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం ఝాన్సీ, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజేష్, యువ కేంద్రం సభ్యులు భీమాల వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

గ్రామాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

విజయవాడరూరల్: గ్రామాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 5వేల పైబడి జనాభా వున్న గ్రామాల్లో సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ స్థానే త్రిఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు గుణదల సబ్‌డివిజన్ డీఈ బాలాజీనాయక్ తెలిపారు. త్రిఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయడం వలన వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. లోఓల్టేజ్ సమస్య ఉందని పేర్కొన్నారు. వినియోగదారులు త్రిఫేస్‌కు అనువైన విద్యుత్ ఉపకరణాలను వినియోగించుకునే వీలు ఏర్పడుతుందన్నారు. ఏసీ, ఫ్రిడ్జ్, మోటారు, గ్రైండర్ లాంటి ఉపకరణాలను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. గుణదల సబ్ డివిజన్ పరిధిలో కొత్తూరు తాడేపల్లి, ముస్తాబాదు, కేసరపల్లి గ్రామాల్లో త్రిఫేస్ విద్యుత్ వైర్లు పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకు అవసర మైన నిధులను విద్యుత్‌శాఖ మంజూరు చేసిందని పేర్కొన్నారు.

నిర్మాణాలు వేగంగా చేపట్టాలి

పటమట(విజయవాడతూర్పు): జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, పేదలందరికీ జగనన్న ఇళ్లు అందించే విధంగా చేయాలని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన హౌసింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. నగరానికి సంబంధించి లే అవుట్లలో లబ్ధిదారుల వివరాలు, గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అదనపు కమిషనర్ సత్యవతి తదితరులున్నారు.

ఈకేవైసీ నమోదు చేయాలి

విజయవాడరూరల్: ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 7వ తేదీ లోగా రైతుభరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి ఈకేవైసీ చేయాలని కోరారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఈకేవైసీ నమోదుకు అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో విద్యార్థిని అదృశ్యమైన ఘటన పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డులో బొమ్మిడి పావని, ఏడు కొండలు కుటుంబ సభ్యులతో నివశిస్తున్నారు. వారి కుమార్తె (17) విజయవాడలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. అయితే విద్యార్థిని తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో బుధవారం ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేమల్లే జెడ్పీ హైస్కూల్‌కు జిరాక్స్ మిషన్ వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌కు ఆంగ్లోపాధ్యాయురాలు నందిగం సువర్చలాదేవి రూ.25 వేలు విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను విరాళంగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్‌పాల్‌కు గురువారం ఈ యంత్రాన్ని ఆమె అందజేశారు. సువర్చలాదేవి భర్త గన్నే వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం పాఠశాల అవసరాల నిమిత్తం ఈ జిరాక్స్ మిషన్‌ను ఆమె అందిస్తున్నట్లు చెప్పారు. ఇతర ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు, పర్సా రాజేష్, వెంకట కుమారి, వెలమర్తి రవిబాబు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో అగ్రగామిగా మారుబోయిన

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాఖ రాష్ట్రంలోనే అత్యధికంగా సభ్యత్వ నమోదు సాధించటం అభినందనీయమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, సేవా తత్పరుడు మారుబోయిన కోటేశ్వరరావు నాయకత్వంలో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. ఈ శాఖలో 2000 మంది సభ్యత్వం సాధించటం, ప్రత్యేకించి మారుబోయిన స్వయంగా 900 మంది సభ్యులను చేర్పించటం అభినందనీయమని చెప్పారు. సమాజంలో మార్పు సాధించేందుకు కృషి చేయటమే మానవత లక్ష్యమని తెలిపారు.

దుర్గమ్మ సేవలో ఈవో

ఇంద్రకీలాద్రి: దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈవోగా నియమితులైన ఎం.శ్రీనివాస్ గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం 11.30 గంటలకు ఆలయానికి విచ్చేసిన ఆయన నేరుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన శ్రీనివాస్‌ను ఆలయ సిబ్బంది ఎవరూ గుర్తించలేదు. వైదిక కమిటీ సభ్యుడు శంకరశాండిల్యను కలిసి మాట్లాడారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 48 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 1వ, 2వ, 4వ, 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 48 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పలు న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టగా, సంబంధిత న్యాయమూర్తులు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వారిలో ఒక వ్యక్తికి 15 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 13 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 05 రోజులు జైలు, రూ. 10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 03 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 02 రోజులు జైలు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి ఒక రోజు జైలు, రూ.10 వేలు జరిమానా, ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా, మిగిలిన 33 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.